ప్రజాశక్తి
గురువారం 3 ఏప్రిల్ 2025
5
విజయనగరం



రైల్వే ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రైల్వేలో ఉద్యోగాల భర్తీకి అవసరమైన శిక్షణను రామ్‌కీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ (గ్రీన్‌ల్యాండ్స్) సంస్థలు ఉచితంగా అందించనున్నాయి. ఈ మేరకు ఆయా సంస్థల ప్రతినిధులు ఎం.వి.రామిరెడ్డి, గద్దె భాస్కర్, ప్రొఫెసర్ లక్ష్మీకుమారి ఒక ప్రకటన విడుదల చేశారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు గ్రూప్ -డి పరీక్ష ద్వారా ఖాళీలు భర్తీ చేయనున్న నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఇదో సువర్ణావకాశమని పేర్కొన్నారు. ఈనెల 5న రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ నగరాల్లో అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. విజయం సాధించిన అభ్యర్థులకు శ్రీధర్ సిసిఎఫ్ సంస్థ నేతత్వంలో 3-4 నెలలపాటు హైదరాబాదులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. అభ్యర్థులకు శిక్షణతోపాటు వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు మరిన్ని వివరాలకు రామ్ కీ ఫౌండేషన్ ప్రతినిధి రేష్మ 919515658033 ను సంప్రదించాలని తెలిపారు.

కెజిబివిలో పోస్టుల భర్తీ జరిగేనా?

● ఆరు నెలలుగా ముందుకు కదలని ఫైల్ ● ఎదురు చూస్తున్న అభ్యర్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ విషయంలో కాలయాపన జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పోస్టులు భర్తీ చేసి, ఉద్యోగాల్లో చేరి వేతనాలు కూడా తీసుకుంటున్నా విజయనగరం జిల్లాలో మాత్రం పోస్టులు భర్తీ ప్రక్రియ పూర్తి కాలేదు. జిల్లాలో కెజిబివి పాఠశాలల్లో కుక్‌లు 27, స్కావింజర్ 11, డే వాచ్మెన్ 4, రాత్రి కాపలాదారు 5, చౌకిదార్లు 6, స్వీపర్లు 2 మొత్తం 55 పోస్టుల భర్తీకి గత ఏడాది అక్టోబర్ 7 తేదీన నోటిఫికేషన్ ఇచ్చారు. నోటిఫికేషన్‌లో అదే నెల 22వ తేదీ లోపు పోస్టులు భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈపోస్టుల కోసం జిల్లా వ్యాప్తంగా 750 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే నోటిఫికేషన్ ఇచ్చి ఆరు నెలల అవుతున్నా పోస్టులు భర్తీ కాలేదు. పోస్టులను భర్తీ చేయడంలో సమగ్ర శిక్ష అధికార యంత్రాంగం నిర్లక్ష్యం చేస్తుందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వాస్తవానికి మండల స్థాయిలో రోస్టర్ విధానంలో ఈ పోస్టులు భర్తీ చేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి ఆరు నెలలు కాలం పట్టిందంటే సర్వశిక్షలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవాల్సిందే. మరో వైపు అధికార పార్టీ నాయకుల సిఫార్సుల కారణంగా ఆలస్యం అవుతోందని చర్చ జరుగుతోంది. మరో వైపు మరో 25 మంది ఇన్‌స్ట్రక్టర్ల పోస్టులు భర్తీ కూడా తాత్సారం జరుగుతోంది. దీంతో పోస్టులు భర్తీ చేస్తారా లేదా సందిగ్ధంలో అభ్యర్థులు ఉన్నారు. పోస్టుల భర్తీ ఆలస్యం కావడంతో అసలు భర్తీ అవుతాయో లేదోనని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

నెలాఖరులోగా పోస్టులు భర్తీ



ఈనెలాఖరులోగా కెజిబివి పోస్టులు భర్తీ పూర్తి చేస్తాం. కెజిబివిలో నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులకు వచ్చిన దరఖాస్తులను కెఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ సమక్షంలో పరిశీలన జరుగుతుంది, 25 ఇనస్ట్రక్టర్ల పోస్టులు భర్తీ ఫైల్ కలెక్టర్ దగ్గర ఉంది. నెలాఖరులోగా పోస్టులన్నీ భర్తీ చేస్తాం.

ఎ.రామారావు, ఎ పి.సి, సమగ్ర శిక్ష



సిఎంఆర్ షాపింగ్ మాల్ సమీపంలో పట్టాలు తప్పిన నాగావళి ఎక్స్‌ప్రెస్



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిఆర్‌ఎం లలిత్‌బోహార్

పట్టాలు తప్పిన నాగావళి ఎక్స్‌ప్రెస్

● తప్పిన పెను ప్రమాదం
● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డిఆర్‌ఎం

ప్రజాశక్తి-విజయనగరం కోట

నాందేడ్ నుంచి సంబల్‌పూర్ వెళ్తున్న నాగావళి (20810) ఎక్స్‌ప్రెస్ బుధవారం ఉదయం విజయనగరంలో పట్టాలు తప్పింది. ఉదయం 11.50 గంటలకు విజయనగరం రైల్వేస్టేషన్‌కు చేరుకున్న రైలు పది నిమిషాలు అనంతరం బయలు దేరింది. స్టేషన్ దాటిన కొద్దిసేపటికే సిఎంఆర్ షాపింగ్‌మాల్ వెనుక (వెంకటలక్ష్మి థియేటర్) సమీపాన హౌరా, రాయపూర్‌లైన్ల క్రాసింగ్ వద్ద చివర గార్డు బోగీతో పాటు మరో రెండు జనరల్ బోగీలు పట్టాలు తప్పాయి. వీటిలో జనరల్ బోగీలు ఉన్నాయి. రైలు నెమ్మదిగా వెళ్లడంతో ప్రాణ నష్టమేమీ జరగలేదు. స్టేషన్ నుంచి బయలుదేరిన క్షణాల్లో రైలు నెమ్మదిగా వెళ్లడంతో ప్రాణ నష్టమేమీ జరగలేదు. ప్రయాణికులకు ఎటువంటి గాయాలూ కాలేదు. వెంటనే రైల్వే అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గురైన భోగీలను రైలు నుంచి తప్పించారు. ఆ రెండు బోగీల్లో ఉన్న వారిని అదే ట్రైన్ లో ఎక్కించి రైలును మధ్యాహ్నం 1.59నిమిషాలకు సంబల్‌పూర్ పంపించారు. వెను వెంటనే రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. అయితే అటు రాయగడ, ఇటు భువనేశ్వర్ రైల్వే క్రాసింగ్ వద్ద ప్రమాదం చోటు చేసుకోవడంతో రైళ్లు విజయనగరం సమీపంలోకి వచ్చేసరికి నెమ్మదిగా నడుస్తున్నాయి. సంఘటనా జరిగిన వెంటనే రైల్వే అధికారులు, రైల్వే, సివిల్ పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. విజయనగరం తహశీల్దార్ కూర్మనాధ్, వన్‌టౌన్ సిఐ శ్రీనివాసరావు తదితరులు సహాయక చర్యలు చేపట్టారు. విజయనగరం ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఎలా జరిగిందో అధికారులను అడిగారు. రాయగడ డిఆర్‌ఎం లలిత్ బోహార్ బుధవారం సాయంత్రం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద ఘటనపై ఆరా తీశారు. ఈ సంఘటనపై ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు డిఆర్‌ఎం, స్టేషన్ మేనేజర్‌తో మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదితి



ఎమ్మెల్యే అదితికి వినతినిస్తున్న, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

ఎమ్మెల్యే అదితి ప్రజాదర్బార్

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు బుధవారం పార్టీ కార్యాలయం అశోక్‌బంగ్లాలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. విన్యా, హౌసింగ్, పింఛన్లు, రోడ్లు, కాలువలు, విద్యుత్ వంటి అనేక అంశాలపై వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమస్యలను ఓర్పుగా విని, సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యక్షంగా చర్చించి, సమస్యలకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీవరప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టిడిపి నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్ బుధవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయనకు టిడిపి నగర ప్రధాన కార్యదర్శి అల్తి బంగారు బాబు, నాయకులు ముద్దాడ చంద్ర శేఖర్, కోండ్రు శ్రీనివాస్‌రావు, ఈగల సత్తిబాబు, రామకృష్ణ, చిట్టిబాబు, చంటితో పాటు పిట్టా శ్రీనివాస్ రావు, విగ్నేష్ తదితరులు అభినందనతుల తెలిపారు.

'సీతం'లో దక్ష డ్రోన్ సెంటర్

విజయనగరం : సీతం ఇంజినీరింగ్ కళాశాల, కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ లో ఒక భాగమైన, దక్ష ఆన్ మాన్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ఒప్పందం జరిగింది. దీనిలో భాగంగా దక్ష డ్రోన్ సెంటర్ ను మాజీ ఎంపి, సీతం కళాశాల కరస్పాండెంట్ బొత్స ఝాన్సీ డ్రోన్ సెంటర్‌ను ప్రారంభించారు. కోరమండల్ డివిజనల్ ఆగ్రోమిస్ట్ మోహన్ కుమార్, డ్రోన్‌సెంటర్ జిఎం వి.మహేష్, ఇఫ్కో మార్కెటింగ్ మేనేజర్ బి.ఎల్.రాజు,కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు పాల్గొన్నారు.

పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలి

11వ పిఆర్‌సి ఎరియర్స్, ఐఆర్, డిఎలు ఇవ్వాలి

కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే వేయాలని, 11వ పిఆర్‌సి బకాయిలు విడుదల చేయాలని, ఐఆర్‌తో పాటు పెండింగ్ డిఎలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ సందర్భంగాఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ 11వ పిఆర్‌సి గడువు ముగిసి 21 నెలలైనా 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడం అన్యాయమని అన్నారు. గత ప్రభుత్వం కాలయాపన చేయడంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఆ ప్రభుత్వ వైఖరిని నిరసించారని, కాని నూతన ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు గడచినా ఆ ఊసే లేకపోవడం విచారకరమని అన్నారు. పెరుగుచున్న ధరలకనుగుణంగా 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి, 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. కరోనా సందర్భంలో మరియు సాధారణంగా చనిపోయిన స్థానిక సంస్థల ఉద్యోగ, ఉపాధ్యాయుల వారసులకు ఐదేళ్లగా కారుణ్య నియామకాలు లేకపోవడంతో ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. సిపిఎస్ ఉద్యోగులకు డిఎలను 90శాతం నగదు రూపంలో ఇవ్వాల్సింది పెండింగ్‌లో ఉందని, వెంటనే చెల్లించాలని కోరారు. సిపిఎస్, జిపిఎస్ లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పెండింగ్ డిఎలు చెల్లించాలని, 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో నెంబర్ 57 ద్వారా పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని, సరెండర్ లీవు బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత పోరాటాల సందర్భంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని పెద్ద ఎత్తున నినదించారు. అనంతరం కలెక్టర్ అంబేద్కర్‌కు వినతి అందజేశారు. ధర్నాలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ పి.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, డి.రాము, కె.విజయగౌరి (యుటిఎఫ్), జోగారావు (ఎస్‌టియు) సదాశివరావు, జోగినాయుడు (ఎపిటిఎఫ్), వి.రమణ (ఆప్టా), శివప్రసాద్ (హెచ్‌ఎం అసోసియేషన్) , శ్యామ్ అప్పారావు, సూరిబాబు, శ్రీనివాసరావు, వెంకటరమణ భాస్కరరావు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం కలెక్టర్‌కు అందజేత

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణపై అవిశ్వాస తీర్మానం లేఖను మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు రాంబార్కి శరత్, బొత్స సురేష్ కలెక్టర్‌కు అందించారు. విజయనగరం కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ అంబేద్కర్‌ను కలిసి అవిశ్వాస తీర్మానం లేఖను అందించారు. లేఖలో 10మంది వైసిపి అసమ్మతి, 10మంది టిడిపి కౌన్సిలర్లు సంతకాలు చేశారు. సంతకాలు నిర్ధారణ చేసుకున్న తర్వాత అవిశ్వాస ప్రత్యేక కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయనున్నారు.






సమావేశంలో మాట్లాడుతున్న ఐజి ఎస్.హరికృష్ణ

సిసిటిఎన్‌ఎస్‌లో కేసుల పురోగతి

ఐజి హరికృష్ణ ● దర్యాప్తులో ఉన్న కేసులపై సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరంకోట

వివిధ పోలీసు స్టేషన్లలో నమోదవుతున్న కేసుల దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు సిసిటిఎన్ఎస్ (క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టం)లో నిక్షిప్తం చేయాలని రాష్ట్ర పోలీసుశాఖ ఐజి పర్సనల్స్ ఎస్.హరికృష్ణ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషనుల్లో పని చేస్తున్న పోలీసు అధికారులతో బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సిసిటిఎన్ఎస్ ద్వారా దర్యాప్తులో ఉన్న గ్రేవ్ కేసులను సమీక్షించారు. భవిష్యత్తులో అన్ని రివ్యూ మీటింగులకు సంబంధించిన సమాచారాన్ని సి.సి.టి.ఎస్.ఎస్. ద్వారానే తీసుకొని, సమీక్షిస్తున్నామన్నారు. కావున, ఎస్ఐలు, సిఐలు, డిఎస్‌పిలు దీనిపట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. సిసిటిఎన్ఎస్ వినియోగించడంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తన దృష్టికి తీసుకువస్తే, వాటిని సమీక్షించి, సమస్యలను ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లి తొలగించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎస్‌పి వకుల్‌జిందాల్ మాట్లాడుతూ పోలీసు స్టేషను పరిధిలో ఏదైనా నేరం నమోదైనపుడు సంబంధిత అధికారులు సంఘటనా స్థలంకు వీలైనంత తక్కువ సమయంలో చేరుకోవాలని, నేర స్థలంను క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌బందాలు తనిఖీ చేసి, కేసులను ఛేధించేందుకు అవసరమైన సాంకేతిక ఆధారాలను సేకరించాలని అధికారులనుఆదేశించారు. స్టేషను పరిధిలో ఉన్న ప్రముఖులు, దేవుళ్ళ విగ్రహాలపై నిఘా పెట్టాలని, విగ్రహాలపై ఆకతాయిలుదాడులు చేయకుండా స్థానికులతో విగ్రహాల రక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. లేడీస్ హాస్టల్స్ లో భద్రత ఏర్పాట్లును సంబంధిత పోలీసు అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. మిస్సింగు కేసుల్లో అలసత్వం వద్దని, ఫిర్యాదు అందిన వెంటనే కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టాలన్నారు. హిస్టరీషీట్లు కలిగిన వ్యక్తులు ప్రవర్తన, నడవడిక, నేర ప్రవత్తిపై నిఘా పెట్టాలన్నారు. మహిళలపై దాడులను నియంత్రిం చేందుకు ప్రారంభించిన శక్తి టీమ్స్ చురుగ్గా పనిచేయాలన్నారు. వివిధ పోలీసు స్టేషన్లులో దర్యాప్తులో ఉన్న కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ కేసుల్లో ప్రతిభ చూపిన అధికారులను, సిబ్బందిని అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, జి.భవ్యరెడ్డి, ఎస్.రాఘవులు, ఎం.వీరకుమార్, సిఐలు, వివిధ పోలీసు స్టేషన్ల ఎస్ఐలు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిఇఒ మాణిక్యం నాయుడు

నేటి నుంచి పదో తరగతి మూల్యాంకనం

జిల్లాకు చేరుకున్న 1.50 లక్షల ప్రశ్నపత్రాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో తరగతి పరీక్షల ప్రశ్నా పత్రాల మూల్యాంకనం ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకు ఏడు రోజుల పాటు జరుగనుంది. జిల్లా కేంద్రంలోని జెయింట్ జోసెఫ్ స్కూలులో ప్రశ్నా పత్రాలను మూల్యాంకనం చేసేందుకు జిల్లా విద్యా శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వారం రోజుల పాటు ఏడు సబ్జెక్టుల మూల్యాంకనం చేయనున్నారు. ఇందుకోసం 101 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 615 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 202 మంది సోషల్ అసిస్టెంట్లను విద్యాశాఖ అధికారులు నియమించారు. మూల్యాంకనం జరిగే సెయింట్ జోషేప్ స్కూల్లో బెంచీలు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, తాగునీరు వంటి ఏర్పాట్లు ఇప్పటికే చేశారు. మూల్యాంకనం ప్రక్రియ సజావుగా జరిగేలా, ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. రెగ్యులర్ విద్యార్థుల ప్రశ్నా పత్రాలతో పాటు, ఓపెన్ స్కూల్ విద్యార్థుల ప్రశ్నా పత్రాలు కూడా మూల్యాంకనం చేయనున్నారు.

రోజుకు 40 పేపర్లు మూల్యాంకనం

ప్రతి సబ్జెక్ట్ ఉపాధ్యాయుడికి రోజుకు మూల్యాంకనం చేసేందుకు 40 పేపర్లు ఇవ్వ నున్నారు.ఒక్కోపేపరు మూల్యాంకనానికి ప్రభుత్వం రూ.10 ఇవ్వనుంది. రోజుకు 40పేపర్లు మూల్యాంకనం చేస్తే ఒక ఉపాధ్యాయుడికి రూ.400 రానుంది.

ఏర్పాట్లు పూర్తి : డిఇఒ

సెయింట్ జోసెఫ్ స్కూల్లో జరగనున్న టెన్త్ ప్రశ్నాపత్రాల మూల్యాంకనం ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేశామని డిఇఒ యు.మాణిక్యం నాయుడు తెలిపారు. ఉపాధ్యాయులు ప్రశాంత వాతవరణంలో మూల్యాంకనం చేసే విధంగా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

ఆవిష్కరణల ప్రోత్సాహానికి శిక్షణ దోహదం : డిఇఒ

ప్రజాశక్తి-విజయనగరంయ టౌన్

విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించి వారిని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు వ్యవస్థాపక మనస్థత్వ అభివృద్ధి శిక్షణ (ఇఎండిపి) ఉపయోగపడుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు అన్నారు. పాఠశాల విద్యాశాఖ, ఎస్‌సిఇఆర్‌టి, ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని గురజాడ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రాజెక్టు ఎక్స్‌పో బుధవారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా డిఇఒ ు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసే ఈ విధమైన కార్యక్రమాలు వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలకంగా వుంటాయన్నారు. జిల్లా ఇఎండిపి మేనేజర్ నరేష్ కాకర మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందడంతో పాటు భవిష్యత్తులో గొప్ప మార్గదర్శకులుగా ఎదిగేందుకు సహాయపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ మనస్తత్వాలకు అనుగుణంగా నడచుకోవాలని జిల్లా సైన్స్ అధికారి సూచించారు. ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్ స్టేట్ లీడ్ సుశాంత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

జిల్లాలోని 15 పాఠశాలల నుంచి ఎంపికైన 9వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. జ్యూరీ సభ్యులు ప్రాజెక్టులను సమీక్షించి అత్యుత్తమ ప్రాజెక్టులను ఎంపికచేశారు. మొదటి బహుమతిని ఎంజెపి ఎపి బిసి బాలికల పాఠశాల- గంట్యాడ, ద్వితీయ బహుమతిని జెడ్‌పి హైస్కూల్, ఎస్.కోట కైవసం చేసుకున్నాయి. గురజాడ స్కూల్ కరస్పాండెంట్ కృష్ణాజీ బహుమతులు అందజేశారు.

ఉపాధి నిధులతో జలవనరుల పనులు

● చెరువు పనులకు ప్రాధాన్యం
● ఖరీఫ్ నాటికి 3.12 లక్షల ఎకరాలకు సాగునీరు
● కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం



జిల్లాలో ఉపాధి హామీ పనులలో జలవనరుల అభివృద్ధికి తొలి ప్రాధాన్యత నివ్వాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈ ఆర్ధిక సంవత్సరంలో మొదటి త్రై మాసిక పనులలో చెరువులు, కాలువలు మరమ్మతులు, పూడిక తీతలు తదితర పనులకు ప్రాధాన్యత నివ్వాలని అన్నారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎంపిడిఒలు, జలవనరుల శాఖ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి వ్యవసాయమే ప్రధాన వనరు అయినందున వచ్చే ఖరీఫ్ కు 3.12 లక్షల ఎకరాలకు సాగు నీరందించడానికి ప్రణాళిక వేయాలని తెలిపారు. ప్రతి మండల అభివృద్ధి అధికారి, మండల ఇరిగేషన్ ఇంజినీరు కలిసి మండలంలో ఉన్న చెరువులను, కాలవలను, ఇతర జలవనరులను గుర్తించి ఉపాధి హామీ పనులలో వాటి అభివృద్ధికి గురువారం లోగా ప్రతిపాదనలు పంపాలన్నారు. ఖరీఫ్‌కు చివరి ఎకరం వరకు నీరందేలా ప్రణాళిక ఉండాలన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఉపాధి పనుల్లో కేవలం నీటి వనరులకు సంబంధించిన మాత్రమే జరగాలని స్పష్టం తెలిపారు. జూలై, ఆగష్టు, సెప్టెంబర్ నెలల్లో ఉద్యాన పంటలు, పశు గ్రాసం, అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలని, ఉప ముఖ్యమంత్రి సూచనల మేరకు పనస కర్ర ను వీణల తయారీలో వినియోగించడానికి పనస చెట్ల పెంపకానికి కూడా ప్రాధాన్యత నివ్వాలని తెలిపారు. అక్టోబర్ నుండి మార్చి వరకు సిసి రోడ్లు, బిటి రోడ్లు, ఇతర పనులకు ప్రాధాన్యత నివ్వాలని తెలిపారు. ఇరిగేషన్ శాఖ ఉపాధి హామీ కింద సాధ్యమయ్యే పనులకు మాత్రమే ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. సమావేశంలో డ్వామా పీడీ శారదా దేవి, ఇరిగేషన్ ఎస్‌ఇ అప్పారావు, ఎంపిడిఒలు, ఎపిఒలు, ఇరిగేషన్ డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

ఉద్యాన సాగు పెంపునకు ప్రణాళిక

జిల్లాలో ఉద్యాన పంటల సాగును పెంచేందుకు 15 రోజుల్లోగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుత జిల్లా పరిస్థితులను బట్టి వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా జిడిపి పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఉద్యానసాగు, సూక్ష్మ సేద్యంపై సమావేశం నిర్వహించారు. ఆహార పంటలకే కాకుండా, ఉద్యాన పంటల సాగుకు కూడా అత్యధిక ప్రాధాన్యత నివ్వాలని చెప్పారు. ఉద్యాన పంటల సాగును విస్తరించేందుకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని ఆదేశించారు. ఈ కొత్త ఆర్థిక సంవత్సరంలో అన్ని పంటల సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు తగిన ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. టిష్యూ కల్చర్ అరటి పంటకు ఎంతో డిమాండ్ ఉందని, ఈ ఏడాది కనీసం 500 హెక్టార్లలో అదనంగా వేయాలన్నారు. ముఖ్యంగా జాతీయ, రాష్ట్ర రహదారులకు ఆనుకొని ఉన్న మండలాల్లో దీనిని విస్తరించడం ద్వారా, మార్కెటింగ్, రవాణాకు అనుకూలంగా ఉంటుందని సూచించారు. హాస్టల్ విద్యార్థులకు అరటిపళ్లను పంపిణీ చేసే అవకాశాన్ని కూడా పరిశీలిస్తామని చెప్పారు. దీనికోసం మండలాల వారీగా అదనపు సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. జిల్లాలో మామిడి పంట విస్తీరణం పెంచే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. మామిడి అంటు కట్టడం, పునరుజ్జీవనం తదితర ప్రక్రియలను నిర్వహించేందుకు మండలానికి పదిమంది చొప్పున ఎంపిక చేసి శిక్షణ ఇవ్వాలని సూచించారు. సమావేశంలో సిపిఒ పి.బాలాజీ, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, ఎపిఎంఐపి పీడీ పిఎన్‌వి లక్ష్మీనారాయణ, ఉద్యాన శాఖాధికారులు, సూక్ష్మ సేద్య ఎఒలు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి - చీపురుపల్లి

పదో తరగతి పూర్తి చేసుకొని ఉన్నత చదువుల కోసం వేరే కళాశాలలకు వెలుతున్న విద్యార్థులందరూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ విద్యార్థులకు సూచించారు. పదో తరగతి పూర్తి చేసుకొని పాఠశాల నుండి రిలీవ్ అవుతున్న విద్యార్థులకు వీడ్కోలు సమావేశం పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిల్లలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం ఎన్‌సిసి విద్యార్థులకు వాలీబాల్, క్రికెట్ కిట్లును ఎన్‌సిసి ఆఫీసర్ మామిడి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని తెన్నూ బొడ్డవర ఎంపియుపి పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ ఉపాధ్యాయులు రెడ్డి శంకరరావు మాస్టర్ గతంలో తను పనిచేసిన పాఠశాలపై అభిమానంతో 70 మందికి బుధవారం ఉచితంగా టేబుల్ బుక్స్, కాపీ రైటింగ్ బుక్స్, పెన్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ నీల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం మరో ప్రాణదానంతో సమానం అని అత్యవసర పరిస్థితుల్లో ఇంకొకరికి మన రక్తం ఉపయోగపడితే జన్మకు సార్థకత ఉంటుందని ప్రతి ఒక్కరూ రక్తదానాన్ని చేయాలని అన్నారు. ఈ రక్తదాన శిబిరాన్ని విజయనగరం మహారాజ ఆసుపత్రి, ఎస్.కోట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించాయన్నారు. ఈ రక్తదాన శిబిరంలో డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది, యువకులు రక్తదానం చేశారని ఆమె తెలిపారు.

ఎంపిడిఒగా తులసీనాథ్

ప్రజాశక్తి- బొండపల్లి

బొండపల్లి ఎంపిడిఒగా ఎ. కె.తులసీనాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన జి.గిరిబాల రెండు నెలల సాధారణ సెలవుపై వెళ్లడంతో ఆమె స్థానంలో జిల్లాపరిషత్ సిఇఒ వెంకటేశ్వరరావు తులసీనాథ్‌కు ఎంపిడిఒగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చలి వేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - బొబ్బిలి

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు నైటింగేల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ మాజీ చైర్మన్ తూముల అచ్యుతవల్లి చలి వేంద్రాన్ని ప్రారంభించారు. మున్సిపాలిటీలో వాటర్ ప్యాకెట్లపై నిషేధం ఉండడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు తాగునీరు కోసం ఇబ్బందులు పడకుండా చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పింఛన్లు అందజేత

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి సచివాలయ పరిధిలోని అరిగిపాలెం గ్రామానికి చెందిన ఈరోతు రాము, నిమ్మకాయల దుర్గమ్మ అనారోగ్య కారణంగా విశాఖలోని వివిధ ఆస్పత్రుల్లో వైద్యం పొందుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఏఎన్‌ఎం వెంకటలక్ష్మి ఇంజనీరింగ్ అసిస్టెంట్ లీల సొంత ఖర్చులతో వారి వద్దకు వెళ్లి బుధవారం పింఛన్ సొమ్మును అందించారు. వీరు చేసిన సేవలకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

బిసి రుణాలకు 550 దరఖాస్తులు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

బీసీ కార్పొరేషన్ రుణాల కోసం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలలో 550 దరఖాస్తులు వచ్చాయని ఇఒపిఆర్‌డి లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ దరఖాస్తులు అభ్యర్థులు తెలిపిన బ్యాంకులకు పంపించనున్నారు. అనంతరం లబ్ధిదారులకు సబ్సిడీతో కూడిన రుణం మంజూరు చేయటానికి అర్హుల జాబితా జిల్లా కేంద్రానికి పంపించనున్నామని.

రాజాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ సొసైటీ రుణాల నిమిత్తం 384 దరఖాస్తులు వచ్చాయని ఎంపిడిఒ శ్రీనివాసరావు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో రాజాం, బొద్దాం స్టేట్ బ్యాంకు మేనేజర్లు, గ్రామీణ బ్యాంకు, కోఆపరేటివ్ సహకార సంఘం బ్యాంక్ సిబ్బంది దరఖాస్తులను బుధవారం పరిశీలన చేశారు. దరఖాస్తుదారులకు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయడానికి జాబితాను బ్యాంకులకు పంపిస్తామని తెలిపారు.

మెరక ముడిదాం: బిసి రుణాలకు సంబంధించిన 343 మంది లబ్ది దారులకు గాను 285 మందికి చెందిన డాక్యుమెంట్లను బుధవారం పరిశీలించామని ఎంపిడిఒ జి. భాస్కరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిజివిబి బ్యాంకు మెరక ముడిదాం, గర్భాం, వెదుళ్ళవలస, ఉత్తరావల్లి, యూనియన్ బ్యాంకు చీపురుపల్లి, ఐ.ఓ.బి పెరుమాలి బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - డెంకాడ

మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పినతాడివాడ, డెంకాడ గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించి తాగునీటి సమస్యలు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పినతాడివాడ పంచాయతీ నోడల్ అధికారిగా మంచినీటి సరఫరాకి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని బోర్లలో వీధి కొళాయిలలో మంచినీటి సరఫరా ట్యాంకులలో క్లోరినేషన్ చేసే విధానాన్ని పరిశీలించారు. గ్రామంలో ఆర్ బోర్లకు ప్లాట్ ఫారమ్స్ రీఛార్జ్ పిట్స్ నిర్మాణం చేసి నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. డెంకాడ వద్ద చంపావతి నదిలో ఉన్న నుయ్యికి నీరు అందకపోవడంతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల సూచనల మేరకు చంపావతి నది నీటిని నూతిలోనికి మళ్ళించి ఫిల్టర్ల ద్వారా సురక్షితమైన మంచినీటిని పంచాయతీకి ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వి.వెంకటరావు పాల్గొన్నారు.

ఇంటర్ తరగతులు ప్రారంభం

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గల బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినిలకు తరగతులు ప్రారంభమైనట్టు ఎంఇఒ బి.నరసింగరావు, హెచ్‌ఎం వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ధర్మవరం ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థినిలు మంచి ఫలితాలు సాధిస్తారని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఇక్కడ చదివే విద్యార్థినులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పుస్తకాలు, మాన్యువల్ పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం ఇలా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, ధర్మవరం పిజిటి అధ్యాపకులు రహీం షేక్ లాల్, ఎస్‌ఎవిఎస్‌ఎస్ మూర్తి, సిహెచ్ కృష్ణారావు, పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి కానిస్టేబుల్ మృతి

విజయనగరం కోట: జామి మండలం తాండ్రంగి గ్రామానికి చెందిన బొబ్బిలి రామకోటి (37) రైలు నుంచి జారిపడి మృతి చెందారు. కొత్తవలస పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మృతుడు విజయనగరంలో నివాసముంటూ ప్రతి రోజూ విజయనగరం నుంచి కొత్తవలసకు డ్యూటీకి వెళ్లివచ్చేవారు. గత 31న మధ్యాహ్నం విశాఖలో పని ఉందని తన భార్యకు చెప్పి రైలుపై వెళ్లి తిరిగి ఈ నెల 1న విజయనగరం వస్తుండగా కోరుకొండ సమీపంలో ప్రమాదవశాత్తు జారి రైలు నుంచి పడిపోయారు. డ్యూటీలో ఉన్న కీ మెన్ చూసి 108కు ఫోన్ చేసి చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

గంజాయితో నలుగురు అరెస్టు

డెంకాడ: మండలం మోదవలస జంక్షన్ చెక్ పోస్ట్ శివార్లలో కొంతమంది వ్యక్తులు గంజాయి సేవిస్తున్నట్లుగా వచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ ఎ.సన్యాసి నాయుడు తన సిబ్బందితో కలిసి బుధవారం రైడ్ చేసి గంజాయి సేవిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి, వారి వద్ద నుండి నాలుగు మొబైల్ ఫోన్లు, ఒక మోటారు సైకిల్, 240 గ్రాముల గంజాయి సీజ్ చేశారు. పట్టుబడిన వారిలో శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలానికి చెందిన ఎర్రగుంట గిరిబాబు (22), విశాఖ జిల్లా పెందుర్తి మండలానికి చెందిన బైపూడి లక్ష్మి నరసింహనాయుడు (20), ఆనందపురం మండలం నీల కుండీలకు చెందిన షేక్ హబీబ్, అనకాపల్లి జిల్లా చీడికాడ మండలానికి చెందిన గంజి వెంకటరావు ఉన్నారని తెలిపారు.

జీవనోపాధులకు అనుగుణంగా రుణ ప్రణాళిక

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

పేదరిక నిర్మూలనలో భాగంగా జీవనోపాధులకనుగుణంగా రుణ ప్రణాళికలను తయారు చేయాలని వెలుగు డిపియం పైనాపు లక్ష్మునాయుడు అన్నారు. బుధవారం స్థానిక వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో జీవనోపాధుల తయారీపై ఎన్యుమరేటర్లకు బుధవారం నుంచి 7వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లకు ఆయన శిక్షణ ఇచ్చారు. మండలంలో 1787 సంఘాలకు గాను 20,509 మంది సభ్యులు ఉన్నారని వీరికి వార్షిక రుణ, జీవనోపాధుల ప్రణాళిక తయారీపై ఎనిమిది సంఘాలకు ఒక ఎన్యుమరేటర్ చెప్పున 223 ఎన్యుమరేటర్లకు గాను బుధవారం సోమవారం వరకూ శిక్షణ ఇస్తామన్నారు. తరువాత వీళ్లంతా గ్రామాలకి వెళ్లి గ్రామ సంఘం మీటింగ్ ఏర్పాటు చేసి ఈ యాక్షన్ ప్లాన్ కోసం సభ్యుల అందరికి ముందు రోజే తెలియజేసి, సభ్యుల అవసరాలు బట్టి జీవనోపాధుల యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపియం పి.భాగ్యలక్ష్మి, మండల సమాఖ్య కార్యదర్శి కె. జయలక్ష్మి, సిసిలు కొటేశ్వరావు, నిర్మల, కేశవ, లక్ష్మి, వివొఎలు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

వెలుగు వివోఎలకు మండల స్థాయి శిక్షణ

నెల్లిమర్ల: స్థానిక వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో వెలుగు వివొఎలు, ఎన్యుమరేటర్లకు మండల స్థాయిలో శిక్షణ తరగతులను బుధవారం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాలకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో వార్షిక రుణం, జీవనోపాధుల ప్రణాళికలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వెలుగు ఎపిఎం ఎస్‌విడి సురేష్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు ఆర్థికాభివృద్ధి, జీవనోపాధుల కల్పన, వార్షిక రుణం ప్రణాళికల తయారీపై వివిఎలు, ఎన్యుమరేటర్లకు మూడు రోజుల పాటు శిక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం డ్వాక్రా సంఘాలకు ప్రణాళికలపై అవగాహన కల్పించి వారిని సమాయత్తం చేస్తామన్నారు. విఒఎలు, ఎన్యుమరేటర్లు శిక్షణ సద్వినియోగం చేసుకొని ఆయా డ్వాక్రా సంఘాల సభ్యులు ఆర్థికంగా, ఆదాయ పరంగా అభివృద్ధి చెందడానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పిజి ఎపిఎం ఎల్.పద్మ, సిసిలు, విఒఎ, ఎన్యుమరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



డెంకాడ: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పీడీ కల్యాణ్ చక్రవర్తి

రేగిడి: గ్రామస్థాయి మహిళా స్వయం శక్తి సంఘాల స్వావలంబనకు నూతన రుణ ప్రణాళికలు ఎంతో అవసరమని సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ డి.రత్నాకర్ అన్నారు. బుధవారం డిఆర్‌డిఎ వెలుగు కార్యాలయంలో రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ఆదేశాల మేరకు సీసీలు, ఎన్యుమరేటర్లు, ఎంఎంఎస్ కార్య నిర్వాహక సభ్యులతో ఐదు రోజుల శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా స్వయం శక్తి సంఘ సభ్యులందరికీ వార్షిక జీవనోపాదుల ప్రణాళికలను తయారు చేసుకోవాలన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన మహిళా సంఘాలు ఆర్థిక బలోపేతానికి ప్రతిఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సంఘా సభ్యురాలు కుటుంబ ప్రస్తుత ఆదాయ పరిస్థితిని గుర్తిస్తూ, వచ్చే ఆర్థిక సంవత్సరంలో వారికి కావల్సిన జీవనోపాది నిమిత్తం ఎంత రుణం కావాలో అంశాన్ని నిర్ధారించాల్సి ఉందని చెప్పారు. అనంతం మహిళా సంఘాల ప్రణాళికలు తయారీ, సంఘాల నుండి చురుకైన విద్యావంతులను ఏన్యుమరేటర్లుగా గుర్తించే వారిని యూనివల్ క్రెడిట్ అండ్ లైవ్లీ వుడ్ యాప్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. వీరితోపాటు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ బాసిన గోవిందరావు ఉన్నారు.

డెంకాడ: మండల మహిళా సమాఖ్యలో 2025-26 వార్షిక రుణ, జీవనోపాధి ప్రణాళికపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి శిక్షణ కార్యక్రమానికి హాజరై, శిక్షణ పొందుతున్న ఎన్యూమరేటర్లతో ప్రత్యక్షంగా పరస్పర చర్చ నిర్వహించారు. ఎన్యూమరేటర్లకు వారు ఎదుర్కొనే సవాళ్లు, డేటా సేకరణ విధానాలు, లబ్ధిదారుల గుర్తింపు, రుణ ప్రణాళికల రూపకల్పనపై విలువైన మార్గదర్శకాలను అందించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిపిఎం రవికుమార్, ఎపిఎం శ్రీనివాస్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, విఒఎలు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

వికలాంగుల పట్ల శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

తమ వికలాంగ పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని మండల విద్యాశాఖ అధికారి బి పాపినాయుడు అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ ఆటిజం దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పనుల ఒత్తిడి వంటి కారణాలను చూపించి వికలాంగ పిల్లల పట్ల అశ్రద్ధ చూపరాదని కోరారు. అలా చేస్తే వికలాంగ విద్యార్థులు ఇతర పిల్లలతో సమానంగా ఎదుగుదల సాధించలేరని తెలిపారు. దీంతో భవిష్యత్తులో ఈ పిల్లలు తల్లిదండ్రులకు భారంగా మారతారని చెప్పారు. ఈ పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. అనంతరం ప్రత్యేక ఉపాధ్యాయులు బంగారునాయుడు, వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ ఈ పిల్లలు సాధారణ పిల్లల వలే కనిపించి నప్పటికీ వారిలో ప్రత్యేక లక్షణాలు ఉంటాయని చెప్పారు. ముఖ్యంగా వీరు ఇతర పిల్లలతో కలవకుండా ఒంటరిగా ఉండడం, తన అవసరాలను తెలియజేయలేక పోవటం, భాషణ లోపాలు ఉండటం, ఒకే విషయాన్ని పదేపదే చెప్పటం, కొన్నిసార్లు తనను తానే గాయపరచుకోవడం వంటి లక్షణాలు ఈ పిల్లల్లో కనిపిస్తాయని తెలిపారు. అనంతరం విద్యార్థులతో తల్లిదండ్రులతో ఆటిజం అవగాహనపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం సూర్యనారాయణ, పలువురు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: ర్యాలీ చేస్తున్న ఎంఇఒ, ఉపాధ్యాయులు

డెంకాడ: ప్రత్యేక అవసరాల పిల్లలపై వారి తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంఇఒ-2 శ్రీరామ్ తెలిపారు. అంతర్జాతీయ ఆటిజం దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలు తల్లిదండ్రులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటిజం ఒకప్పుడు తక్కువగా ఉండేదని ఇప్పుడు రోజు రోజుకి ప్రపంచ వ్యాప్తంగా పెరిగిపోతుందని అన్నారు. ప్రతి 42 మందిలో ఒక్కరు వికలాంగులుగా ఉంటున్నారని తెలిపారు. ఈ వైకల్యం లక్షణాలు నివారణ పద్ధతులు తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పినతాడివాడ హెచ్‌ఎం రాజశేఖర్ ఐఇఆర్‌పిలు బి రవీంద్రరావు, కె.అప్పలరాజు, అక్కివరం ఉపాధ్యాయులు ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఎంఇఒ ఈపు విజయ్‌కుమార్ హాజరై మాట్లాడారు. చిన్న తనం నుంచి పిల్లలు మానసిక ఎదుగుదల లేకుండా పోవడం అటిజంగా పిలుస్తారన్నారు. మానసికంగా ఎదుగుదలకు భవిత కేంద్రాలు దోహద పడతాయని తెలిపారు. అటిజంతో బాధపడుతున్న పిల్లలను తల్లి దండ్రులు, భవిత కేంద్రం శిక్షకులు వారిని దగ్గరుండి చూసుకొని మానసిక ఎదుగుదలకు మరింత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామతీర్థం జడ్‌పి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎస్‌ఎల్‌ఎస్ ఆర్ శాస్త్రి, బొప్పడాం హెచ్‌ఎం నగేష్ కుమార్, భవిత మెర్జ్ పాఠశాల హెచ్‌ఎం రాజేష్, ఐఇఆర్‌టి బి.అప్పలనాయుడు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

మెరక ముడిదాం: మండలంలోని భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని వికలాంగ పిల్లలు మధ్య ఉపాధ్యాయ సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 ధర్మ శ్రీను, ఎంపిపిఎస్ ప్రధానోపాధ్యాయులు ఏ. సత్యనారాయణ, జెడ్‌పిహెచ్‌ఎస్ ఐయిడి పి.జ్యోతి, సహిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతినిస్తున్న నాయకులు

ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బూరాడ, కోడిశ, సంకిలి గ్రామాలతో పాటు ఇతర గ్రామాల్లో భూ సమస్యలు ఉన్నాయని, మ్యుటేషన్ ప్రక్రియ చేపడితే రెవెన్యూ అధికారులు తిరస్కరిస్తున్నారని భూ సమస్య తక్షణమే పరిష్కరించాలని టిడిపి నాయకులు గులివిందుల శ్రీనివాసరావు, వావిలపల్లి నాగభూషణరావు, కేత శంకరరావు రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు క్యాంపు కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందించారు. బూరాడ గ్రామంలో రైతులు పడుతున్న సమస్య దృష్ట్యా మ్యుటేషన్లు జరగడం లేదని, మండలంలో అనేక గ్రామంలో ఉన్న రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఇలాంటి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని, రైతులను ఆదుకోవాలని కోరారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి- రాజాం

మున్సిపల్ కార్యాలయంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆప్కాస్ రద్దుచేస్తే, ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించకుండా మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే. సురేష్, మున్సిపాల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకి ఇస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ మేరకు తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తున్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కరోనా ఇతర ఈ విపత్తర పరిస్థితుల్లో పనిచేసిన మున్సిపల్ కార్మికులను ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా పొగిడి, వారి కాళ్ళను కడిగి ఆ నీళ్లను నెత్తిన చల్లుకున్న వారి రుణం తీర్చుకోలేదని చెబుతున్న పాలకులు ఉద్యోగులను పర్మినెంట్ చేయమంటే వీరు అవుట్ సోర్సింగ్ కార్మికులు కదా అని మాట్లాడడం విడ్డూరంగా ఉందని వాపోయారు. ప్రభుత్వ ఉద్యోగుల వలే 62 సంవత్సరాల వరకు కొనసాగించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, రిటైర్మెంట్ అయిన వారి కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, మట్టి ఖర్చులు పెంపు, ఎక్స్‌గ్రేషియా పెంపు, తదితర సమ్మె ఒప్పంద జీవోలు ఇవ్వాలని, పట్టణ విస్తరణ పెరుగుతున్న నేపథ్యంలో కార్మికులు సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో స్థానిక మున్సిపల్ యూనియన్ నాయకులు ఎన్.రవి, ఎన్.శ్రీను పి.రాజేష్ ఏ.దుర్గా శంకరరావు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతినిస్తున్న నాయకులు, కార్మికులు

టిడిపిలో పలు కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని బి.రాజేరు సర్పంచ్ ఈదుబిల్లి కృష్ణ, గొల్లుపాలెం సీనియర్ నాయకులు తొత్తడి సత్తిబాబు, రెండు గ్రామాలకు చెందిన పలువురు వార్డు సభ్యులతో పాటు 450 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. ఈ మేరకు గజపతినగరం పార్టీ కార్యాలయం వద్ద బుధవారం సాయత్రం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వీరందరికీ పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై పార్టీలోకి రావడం శుభ పరిణామం అన్నారు. పార్టీలో చేరిన వారు ఒక పక్క ప్రజా సంక్షేమానికి, మరో పక్క టిడిపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కొండపల్లి కొండలరావు, టిడిపి మండల అధ్యక్షుడు కోరాడ కృష్ణ, మాజీ వైస్ ఎంపిపి బొడ్డు రాము, సర్పంచ్‌లు మీసాల జానకీ రావు, కర్రోతు శ్రీనువాసరావు, నడుపూరు భాస్కరనాయుడు, పాశల సీతారామ మూర్తి, బుద్ధరాజు సత్యన్నారాయణ రాజు, చింతలపాటి శ్రీనివాసరాజు, రాపాక అచ్చంనాయుడు, పివివి గోపాలరాజు, శనపతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో 250 కుటుంబాలు చేరిక

బొబ్బిలి: మండలంలోని అలజంగి, వెలగవలస గ్రామాలకు చెందిన 250 కుటుంబాలు బుధవారం ఎమ్మెల్యే బేబినాయన సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నాయి. అలజంగి గ్రామానికి చెందిన రెడ్డి ప్రసాద్, వెలగవలస గ్రామానికి చెందిన వి.శ్రీరాములనాయుడు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే బేబినాయన కండువాలు వేసి ఆహ్వానించారు. రాష్ట్రంలో టిడిపి కూటమి చేస్తున్న అభివృద్ధి పనులకు ప్రజలు ఆకర్షతులై టిడిపిలో చేరుతున్నారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వి.సత్యనారాయణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణ చర్యలపై సమావేశం

ప్రజాశక్తి- బొబ్బిలి

పురపాలక కార్యాలయంలో వాల్వ్ ఆపరేటర్లు, పైప్‌లైన్ ఫిట్టర్, అన్ని వార్డు సచివాలయాల ఎమినిటీ సెక్రటరీలు, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లతో రానున్న వేసవికాలం దృష్ట్యా తీసుకోవలసిన ముందస్తు వేసవి నివారణ చర్యలుపై కమిషనర్ ఎల్.రామలక్ష్మి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణ పరిధిలో తాగునీటి సరఫరా చేయు వేళలలో సంబంధిత వార్డు ఎమినిటీ సెక్రటరీ, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్(తాగునీటి సరఫరా), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఫీల్డ్ విజిట్ చేసి తాగునీటి నమూనాలు సేకరించి ప్రమాణాలకు లోబడి నీటి సరఫరా జరుగుతున్నది లేనిది పరీక్షించాలన్నారు. భోజరాజపురం ప్రధాన నీటి సరఫరా కేంద్రం వద్ద ఇన్ఫిల్ట్రేషన్ బావులకు చేయించవలసిన మరమ్మతులు, ఇతర ఎలక్ట్రిఫికెషన్ పనులు యుద్ధ ప్రాతిపదికన చేయించాలన్నారు. పట్టణ పరిధిలో తాగునీటి సరఫరా జరుగుతున్నప్పుడు ఏవైనా లీకులను గుర్తించినట్లయితే వాటిని వెంటనే అరికట్టి నీరు వృథాగా పోకుండా చూడాలన్నారు. మంచినీటి కుళాయిల వద్ద అవసరమైన మరమ్మతులు చేయించి, కుళాయి హెడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పట్టణ పరిధిలో ఉన్న పైలెట్ వాటర్ సప్లై స్కీములను పరిశీలించి వాటికి అవసరమైన మరమ్మతులు చేయించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. పట్టణ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలు వేసవి తాపానికి గురికాకుండా చూడాలని ఆదేశించారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ శంకుస్థాపన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణ కేంద్రంలో శ్రీనివాస కాలనీలో రెండు లక్షల ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులతో చేపట్టనున్న కాలువ, కల్వర్టు పనులకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘు రాజు బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం కాలనీలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించి పిల్లలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి, రాష్ట్ర టూరిజం శాఖ డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి, మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, ఎంపిటిసి మజ్జి దేవి, దార గిరి, వార్డు మెంబెర్ ఆడారి సూరిబాబు, గంగరాజు, వాకాడ రమణ, మోపాడ శ్రీను, వబ్బిన సతీష్, మద్ది కృష్ణ, బ్రాహ్మజీ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతి ప్రదానం

ఉగాది, రంజాన్ పండగల సందర్భంగా ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో చిన్నారులకు నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేతలకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేతులమీదుగా బుధవారం బహుమతులను ప్రదానం చేశారని కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయస్థాయి క్రీడాకారిని వైస్ ఎంపిపి ఇందుకూరి సుబ్బలక్ష్మి, ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్‌వి సత్యశేఖర్, ఆనల రమేష్, కోచ్ మహమ్మద్ ఖలీలుల్లా పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

పనితీరు మెరుగు పరుచుకోవాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

విఆర్‌ఒలు పనితీరు మెరుగుపరుచుకోవాలని తహశీల్దార్ యం.శ్రీను అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిఒ నెంబర్ 30కి అనుగుణంగా ఎవరైతే ఇల్లు నిర్మించుకున్నారో వారి వివరాలు సేకరించాలని, రేషన్ కార్డుదారుల ఈకెవైసిలో డీలర్లకు సహకరించి నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డిటి సుబ్బారావు, ఆర్‌ఐ ప్రేమ్‌కుమార్, పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి భోగాపురం

మండల కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ నాయకులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ముఖ్యంగా రెవెన్యూ, తాగునీటి సమస్యలపై వినతులు వచ్చినట్లు జనసేన పార్టీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే లోకం మాధవి ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. వచ్చిన వినతులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. జనసేన నాయకులు పల్లంట్ల జగదీష్, పల్ల రాంబాబు, పిడుగు జోగారావు, బొబ్బిలి నాయుడు పాల్గొన్నారు.

కాలువల నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వాడుక నీరు, వర్షపు నీరు రహదారులపై రాకుండా కట్టడి చేసేందుకు అవసరమైన అన్నిచోట్ల కాలువల నిర్మాణాలను చేపడతామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లోఆయన పర్యటించారు. పోర్టు సిటీ స్కూల్ వరకు ఉన్న ప్రాంతాన్ని గమనించారు. రహదారికి ఇరువైపులా కాలువలు నిర్వహణ సరిగా లేనట్లు గమనించి తక్షణమే నూతనంగా కాలువ నిర్మాణ పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ సిబ్బందికి ఆదేశించారు. పలు ప్రాంతాలలో చెత్తాచెదారాలు నిల్వ ఉండడానికి గమనించి ప్రజారోగ్య సిబ్బందిని మందలించారు. నగర పరిశుభ్రతకు, క్రమబద్ధీకరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.

కుష్టు బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలోని జెడ్‌పి బాలికొన్నత పాఠశాల విద్యార్థులు కుష్టు వ్యాధి బాధితులకు బుధవారం ఆర్థిక సాయం అందించారు. లెప్రసీ బాధితుల అంగవైకల్య నివారణకు రూ.9950 నగదును హెచ్‌ఎం జి. శారద దేవి చేతులు మీదుగా లెప్రసీ సొసైటీ ఎగ్జిక్యూటివ్ లెంక రమణకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శారద దేవి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవ అలవర్చుకోవాలన్నారు. వ్యాధి గ్రస్తులకు సహాయ సహకారాలు అందించడానికి దాతలు ముందుకు రావాలని వారిపై వివక్ష చూపకుండా ప్రేమతో ఆదరించాలని చెప్పారు. లెంక రమణ మాట్లాడుతూ జిల్లాలో లెప్రా సొసైటీ జిల్లా ప్రభుత్వ మహారాజ ఆసుపత్రిలో జిల్లా కుష్టు నివారణ అధికారి సహకారంతో బాధితులకు అంగవైకల్యం నివారణకు రిఫరెల్ సెంటర్ ద్వారా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా వ్యాధి బాధితులకు ఉచితంగా ప్రత్యేక పాదరక్షలు, సెల్ఫ్‌కేర్ కిట్లు, ఫిజియోథెరపీ సేవలు అందించనున్నట్లు తెలిపారు. దాతలు నుండి విరాళాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

ఎస్ఐ సతీష్‌కు ప్రశంస

ప్రజాశక్తి- నెల్లిమర్ల

జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ నెల్లిమర్ల పోలీస్ స్టేషన్లో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న ఏఎస్‌ఐ సతీష్‌ని అభినందించి బుధవారం ప్రశంస పత్రం అందించారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండి, అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు వచ్చే విధంగా పనిచేస్తున్నందుకు ఎస్‌పి ఆయన్ను అభినందించారు.

బిఎల్‌ఒలకు శిక్షణ

ప్రజాశక్తి - చీపురుపల్లి

నియోజకవర్గంలోని చీపురుపల్లి, మెరకముడిదాం మండలాలకు చెందిన బిఎల్‌ఒలకు బుధవారం శిక్షణా తరగతులను ఏర్పాటు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్డిఒ జివి సత్యవాణి పాల్గొని మాట్లాడారు. ఓటర్ల చేర్పులు మార్పులతో పాటు ఎన్నికల వర్క్‌కి సంబంధించి బియల్‌ఒలు కీలక పాత్ర వహించాలన్నారు. ఓటర్ల జాబితా, ఎన్నికల వర్క్‌పై బియల్‌ఒలు పూర్తి అవగాహన ఏర్పరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి, మెరకముడిదాం తహశీల్దార్లు నమ్మి రాజారావు, అజు రఫీజాన్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు ఎం హర్షవర్ధినితో పాటు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో 29 పంచాయతీలలో బిఎల్‌ఒలుగా పనిచేస్తున్న సిబ్బందితో ఆర్‌ఒ మురళీ బుధవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఓటరు నమోదుపై సీనియర్ బిఎల్‌ఒలతో మాట్లాడించారు. వాటిలో చిన్నచిన్న తప్పులను అక్కడికక్కడే సవరించారు. రెండు చోట్ల ఓటు కలిగి ఉన్నవారి దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. విధి నిర్వహణలో 6, 7, 8 ఓటరు దరఖాస్తు ఫారాలు క్రమ పద్ధతిలో క్షుణ్ణంగా ఒకటికి రెండుసార్లు పరిశీలించి ఓటు నమోదు చేస్తే ఇబ్బంది ఉండదని చెప్పారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల డీటీ సునీత, వేపాడ డిప్యూటీ తహశీల్దార్ డి.సన్యాసినాయుడు, ఎంఆర్ఐ రామలక్ష్మి పాల్గొన్నారు.